క్లుప్తంగా

ఇంద్రకీలాద్రికి తరలిన భవానీలు



ఇరుముడులతో వెళుతున్న భవానీలు

కొయ్యలగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి (విజయవాడ) క్షేత్రానికి భవానీలు ఆదివారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. నూట ఒకరోజు మొదలుకొని నలభై ఒక రోజు, ఇరవై ఒకరోజు దీక్షలు ముగించుకున్న భవానీలు కన్నాపురం రోడ్డులోని శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు భవాని జిలేబి రాజు ఆధ్వర్యంలో అమ్మవారి శరణు ఘోష చేస్తూ భవానీలు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి సామూహికంగా బయలుదేరారు. ఈ సందర్భంగా టెంపుల్స్ సెంటర్‌లోని వివిధ ఆలయాలను సందర్శిస్తూ వెళుతున్న భవానీలకు బంధుమిత్రులు కుటుంబీకులు పూజలు నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు.

పీఎంపీ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం



సమావేశమైన పీఎంపీ అప్‌లాండ్ అసోసియేషన్ సభ్యులు

కొయ్యలగూడెం: కమ్యూనిటీ పారా మెడికల్స్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) 62వ వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనందం సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం పీఎంపీ అసోసియేషన్ భవనం వద్ద అప్‌ల్యాండ్ అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. సోమవారం ఏలూరు పెరుగు చెట్టు సెంటర్ సీతారాం భర్తియా ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించి పీఎంపీ అసోసియేషన్ సభ్యులకు నాయకులు దిశా నిర్దేశం చేస్తారని, సమావేశానికి జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు హాజరవుతున్నారన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టరూ..



గోతులమయంగా ఉన్న రహదారి

లింగపాలెం: సింగగూడెంలో రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. మండలంలోని లింగపాలెం నుంచి సింగగూడెం, కొత్తపల్లి వెళ్లే రహదారి, సింగగూడెంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడింది. దీనికి తోడు వాడకం నీరు కూడా రోడ్డుపై ప్రవహించడంతో, గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి రోడ్డును నిర్మించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పెదవేగి : ఏసుక్రీస్తు బోధనలను అనుసరిస్తూ శాంతి మార్గంలో అందరూ జీవించాలని సీఎస్‌ఏ ప్రోవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ శౌరీలియ అన్నారు. పెదవేగి మండలం పినకడిమిలోని ఫాదర్ సిల్వియో పాస్కలీ విద్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రోవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ శౌరీలియు పాల్గొని, క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా క్రీస్తు జన్మదిన దృశ్యాన్ని ప్రదర్శించారు. కరస్పాండెంట్ సిస్టర్ స్వర్ణ ఇన్నాసమ్మ విద్యార్థులకు కేక్ పంచుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ ప్రభావతి, ఇతర సిస్టర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి

పెదవేగి : వైఎస్సార్‌సీపీ నాయకుడు, పెదవేగి మాజీ సర్పంచ్ తాతా సత్యనారాయణ (72) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పెదవేగి ఎంపీపీ తాతా రమ్యకుమార్ మామ. సత్యనారాయణ పీసీసీ సభ్యుడిగా, ఏలూరు డీసీఎంఎస్ డైరెక్టర్‌గా సేవలందించారు. గాంధేయ వాదిగా పేరుతెచ్చుకున్నారు. సత్యనారాయణ మృతి పట్ల పలువురు నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

దహన సంస్కారాలకు దారేదీ ?

- శ్మశాన వాటికలో సౌకర్యాల లేమి
- లైట్లు, వాటర్ ట్యాంక్ లేక ప్రజల ఇక్కట్లు
- సెల్‌ఫోన్, వాహనాల వెలుగుల్లోనే అంత్యక్రియలు



ఆటో లైట్ల సహాయంతో దహన సంస్కారాలు చేస్తున్న దృశ్యం



సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో దహన సంస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమల గ్రామంలోని శ్మశాన వాటికలో కనీస వసతులు లేవు. దీంతో ఆఖరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు. ఎవరైనా చనిపోతే చిమ్మ చీకట్లో సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లో శ్మశాన వాటికకు తీసుకెళ్లి, అష్టకష్టాలు పడి దహన సంస్కారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే 11 వేల 244 మంది జనాభా ఉన్న ద్వారకాతిరుమల గ్రామంలో దాదాపు అన్ని కులాలు, మతాల వారు బస్టాండు సమీపంలో ఉన్న శ్మశాన వాటికను దశాబ్దాల కాలంగా వినియోగిస్తున్నారు. ఒకప్పుడు చాలీచాలకుండా, ముళ్ల పొదలతో అధ్వానంగా ఉన్న ఈ శ్మశాన వాటికను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.20 లక్షలతో విస్తరించారు. అలాగే ముళ్ల పొదలను, చెట్లను తొలగించి, పెద్దపెద్ద గుంతలను పూడ్చి, దహన సంస్కారాలకు అనువుగా చేశారు. ఈ అభివృద్ధి పనులు గ్రామస్తులకు ఎంతో ఊరట కలిగించాయి. అయితే శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలోనూ, శ్మశానంలోనూ కనీసం స్ట్రీట్ లైట్లు లేక ప్రస్తుతం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

చచ్చే చావొస్తోంది

ఎవరైనా చనిపోతే వారిని శ్మశానానికి తీసుకెళ్లే వారికి చచ్చే చావొస్తుంది. చిమ్మ చీకట్లో, విష సర్పాల మధ్య నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. కొందరైతే సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో పాడెను మోస్తూ శ్మశానానికి చేరుకుని, దహన సంస్కారాలను నిర్వహిస్తున్నారు. తాజాగా శనివారం గ్రామానికి చెందిన రేవూరి వెంకటేశ్వరరావు అంత్యక్రియలను తొలుత సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లో, ఆ తరువాత ఆటో లైట్ల వెలుగుల్లో, నానా పాట్లు పడుతూ నిర్వహించాల్సి వచ్చింది. కూటమి పాలకులు శ్మశాన వాటికపై దృష్టి సారించి స్ట్రీట్ లైట్లతో పాటు, స్నానాలు చేసేందుకు వీలుగా వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదేం దౌర్భాగ్యం



మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో ఎన్ని సమస్యలు పరిష్కారమైనా.. శ్మశాన వాటిక సమస్య మాత్రం పూర్తి స్థాయిలో పరిష్కారం కావడం లేదు. ఎవరైనా చనిపోతే ఆఖరి మజిలీకి వెళ్లాలంటేనే భయమేస్తోంది. శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో కనీసం వీధి లైట్లు లేవు. చీకట్లోనే వెళ్లి కార్యక్రమాలను పూర్తి చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్మశాన వాటిక విస్తరణ, అభివృద్ధి పనులు నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వంలో మిగిలిన వసతులు ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు కలుగుతుంది.

– చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, గ్రామస్తుడు, ద్వారకాతిరుమల

స్నానాలకు నీళ్లు కూడా లేవు



శ్మశాన వాటిక వద్ద ఉన్న రెండు చెరువులు బురదమయంగా ఉన్నాయి. దహన సంస్కారాల అనంతరం వాటిలో స్నానాలు చేసే వీలులేదు. వాటర్ ట్యాంకర్ తెచ్చుకుని స్నానాలు చేయాల్సి వస్తుంది. అవసరమైనప్పుడు వాటర్ ట్యాంకర్ అందుబాటులో లేకపోతే పరిస్థితి ఏమిటి. పాలకులు శ్మశాన వాటిక సమీపంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. అలాగే శ్మశాన వాటిక ప్రాంతంలో మళ్లీ పెరుగుతున్న ముళ్ల చెట్లు తొలగించాలి.

– పెద్దిరెడ్డి త్రిమూర్తులు, గ్రామస్తుడు, ద్వారకాతిరుమల

విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు



చింతలపూడి ఎత్తిపోతల కాలువ గట్టును కొల్లగొట్టిన దృశ్యం

కొయ్యలగూడెం: చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలవ గట్టు మట్టి మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. వారం రోజులుగా రాత్రి వేళల్లో కన్నాపురం గ్రామానికి చెందిన మట్టి మాఫియా జేసీబీలను పెట్టి కాలవ గట్టును కొల్లగొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కాలవ గట్టు సగభాగం మట్టిని తరలించుకుపోయారని రైతులు పేర్కొన్నారు. టిప్పర్ మట్టిని నాలుగు వేల నుంచి ఐదు వేల రూపాయల వరకు ఇటుక బట్టీల నిర్వాహకులకు అమ్మి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. మట్టి అక్రమ రవాణా గురించి తాడిపూడి ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కాలువ గట్టు కోతకి గురి కావడంతో వ్యవసాయ పొలాలలోకి తమ వాహనాలు రాకపోకలు సాగించలేకపోతున్నాయన్నారు. దీని వలన పండిన పంటను గమ్య స్థానాలకు చేర్చడానికి రెండింతల భారంగా పరిణమించిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మట్టి అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని రైతులు కోరుతున్నారు.

నత్తనడకన రోడ్డు పనులు



కుక్కునూరు-భూర్గంపాడు రహదారి దుస్థితి

కుక్కునూరు: కుక్కునూరు-భూర్గంపాడు మధ్య జరుగుతున్న రోడ్డు పనుల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన గుత్తేదారు రోడ్డుపై వెట్ మిక్స్ పోసి వాటరింగ్ చేయకపోవడంతో రోడ్డుపై దుమ్ము కారణంగా దారి కనపడక ఇటీవల రెండు కార్లు అదుపు తప్పి రోడ్డు ప్రక్కన పొదల్లోకి దూసుకెళ్లిన ఘటనలు చోటు చేసుకున్నాయి. రోడ్డు పనుల కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించకపోవడం పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై దుమ్ము లేవకుండా చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరినా వారు కాంట్రాక్టర్‌కు చెప్పి చర్యలు చేపట్టకపోవడంతో గ్రామస్తులే స్వయంగా రోడ్డును క్యూరింగ్ చేసుకుంటున్న దుస్థితి నెలకొంది. రోడ్డు పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా ఇంకా రోడ్డు పై తారు పోయించకపోవడం పనులు నత్తనడకన సాగడం పట్ల ఇబ్బందులు పడతున్నామని ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ పాలన రావడం ఖాయం



కొయ్యలగూడెం: భారీ కేక్ కట్ చేస్తున్న విద్యార్థిని



ద్వారకాతిరుమల: వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ మంత్రి వనిత

కొయ్యలగూడెం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పాలన మళ్లీ రావడం ఖాయమని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి సరిపల్లి గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షురాలు మందపాటి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజలు విసుగు చెందారని సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఇరవై ఐదు కేజీల భారీ కేక్‌ను విద్యార్థినితో కట్ చేయించారు. మంగపతిదేవిపేటలో మాజీ సర్పంచ్ తేలే శ్రీనివాస్, చిడిపి వంశీ, తేలే శివాజీ, యర్రంపేటలో చింతలపూడి కిషోర్, ఉస్సే బాబురావు, గంగవరంలో కంచర్ల సత్యనారాయణ, బల్లె నాగేశ్వరరావు, గవరవరంలో చీమకుర్తి సత్యనారాయణ ఎంపీటీసీ బిరుదుగడ్డ రత్నకుమారి, పొంగుటూరులో సర్పంచ్ పసుపులేటి రాంబాబు, కైకవరపు గోపి, రాజవరంలో ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు, శ్రీరంగ విశ్వనాథం, తమ్మిర్చి బ్రహ్మన్న ఆధ్వర్యంలో వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

రేయింబవళ్లు సంక్షేమ సారథి వేడుకలే

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు 21వ తేదీన ఉదయం నుంచి ప్రారంభమై అర్ధరాత్రి వరకు కొనసాగాయి. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో పొలం బాట పట్టిన రైతు కార్మికులు సాయంత్రానికి చేరుకొని సంక్షేమ సారథికి శుభాకాంక్షలు తెలపడానికి వెల్లువెత్తారు.

ఘనంగా జగనన్న జన్మదిన వేడుకలు

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లి పంచాయితీ, సాయన్నపాలెంలో వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు రెండో రోజు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ హోం మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి, పార్టీ శ్రేణులకు అందించారు. ఈ వేడుకల్లో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, సీహెచ్ పోతేపల్లి సర్పంచ్ పోల్కంపల్లి అనీల్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బసివిరెడ్డి వెంకట్రామయ్య, బసివిరెడ్డి రాంబాబు, బొండాడ వెంకన్నబాబు, మోటేపల్లి రమేష్, బసివిరెడ్డి పవన్, గాజుల నాగు, మోటేపల్లి బ్రహ్మయ్య, పోతన శేషారావు, తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి భగవద్గీత ఆదర్శం



భగవద్గీత పారాయణలో పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: భగవద్గీత మానవాళి మనుగడకు ఆదర్శనీయమని గీతా ప్రబోధాన్ని అనుసరించిన వ్యక్తులు ఆదర్శనీయులవుతారని డాక్టర్ లక్ష్మీ ధర్ బెహరా (డైరెక్టర్ ఐఐటీ, మండి హిమాచల్‌ప్రదేశ్) పేర్కొన్నారు. గీతాజయంతి వేడుకలలో భాగంగా లెర్న్ గీత లివ్ గీత, ఇస్కాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. సృష్టిలో పుట్టిన రోజు జరుపుకునే ఏకైక గ్రంథం శ్రీమద్ భగవద్గీత మాత్రమేనని పరమ పవిత్రమైన భగవద్గీతను సుమారు ఐదు వేల సంవత్సరాలకు పూర్వమే శ్రీకృష్ణ భగవానుడిచే ప్రియ భక్తుడైన అర్జునుడుకు ఉపదేశించారన్నారు. భగవద్గీత చదవటం ద్వారా మానవ జీవితంలోని అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని, గీత మత గ్రంథం కాదని ధర్మ గ్రంథమన్నారు. గీతాపారాయణం శ్లోకాలను పఠించి వివరించడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మెమొంటోలు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ వీఎస్ఎన్ స్వామి, కళ్యాణి ప్రసాద్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రావి నరసింహారావు మృతి తీరని లోటు



నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత బీవీఎస్ రెడ్డి

లింగపాలెం: మండలంలోని ముడిచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రావి నరసింహారావు మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) అన్నారు. ఇటీవల ముడిచర్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నరసింహారావు చిత్రపటానికి ఆదివారం పార్టీ నాయకులు బీవీఎస్ రెడ్డి, ముసునూరి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుమారుడు రావి కొండయ్య, సర్పంచ్ రావి రమాదేవిలతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మట్టా సురేష్, రాష్ట్ర మాజీ లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, నాయకులు భీమిరెడ్డి ప్రభాకరరెడ్డి, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చినవెంకన్న క్షేత్రంలో శునకాల బెడద



ఘాట్ రోడ్డులో వాహనాలకు అడ్డు పడుతున్న వీధి కుక్కలు



శ్రీవారి కొండపైన సెంట్రల్ పార్కింగ్ ప్రాంతంలో రహదారిపై గుంపుగా ఉన్న శునకాలు

బెంబేలెత్తిపోతున్న శ్రీవారి భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై వీధి శునకాలు స్వైర విహారం చేస్తూ, భక్తులను బెంబేలెత్తిస్తున్నాయి. ఘాట్ రోడ్లలో గుంపులు గుంపులుగా తిరుగుతూ హడలెత్తిస్తున్నాయి. సెంట్రల్ పార్కింగ్ పరిసర ప్రాంతాలతో పాటు, నిత్యాన్నదాన భవనం, శివాలయం రోడ్డులో, ఆలయ తూర్పు ప్రాంతంలో ఇవి ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఏ సమయంలో ఎటునుంచి వచ్చి అవి దాడి చేస్తాయోనని భక్తులు భీతిల్లుతున్నారు. అలాగే ఘాట్ రోడ్లలో భక్తుల వాహనాలకు సైతం ఇవి అడ్డు పడుతున్నాయి. గతంలో దేవస్థానం అధికారులు ఎంతో వ్యయ ప్రయాసలతో ఆలయ పరిసరాల్లో సంచరించే వీధి శునకాలను పట్టించే వారు. పట్టుకున్న వ్యక్తులు వాటిని దూర ప్రాంతాలకు తరలించకుండా, దగ్గరలో విడిచిపెట్టడం వలన అవి మళ్లీ క్షేత్రంలోకి చేరుతున్నాయి. వీటికి తోడు పలు ప్రాంతాల నుంచి కాలి నడకన వచ్చే భక్తుల వెంట కొన్ని శునకాలు వస్తున్నాయి. అవి కూడా ఇక్కడే ఉండిపోతున్నాయి. దీంతో క్షేత్రంలో వీధి కుక్కల బెడద తీవ్రతరమైంది. అధికారులు వీటి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

రామానుజన్ జీవితం ఆదర్శనీయం



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండే సుధాకర్, పెద్దలు, చిన్నారులు

భీమడోలు: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గణిత ఘనాపాటి శ్రీనివాస రామానుజన్ 138వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పెద్దలు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రంథపాలకుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలను ధ్వంసం చేస్తున్న పందులు



పందులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతులు

కొయ్యలగూడెం: మొక్కజొన్న పంటలను పందులు ధ్వంసం చేస్తున్నాయని, వాటి నుంచి తమ పంటలకు రక్షణ కల్పించాలని గవరవరం గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. గత కొద్ది రోజుల నుంచి పందులు మొక్కజొన్న చేలు, వర్జీనియా తోటల్లో ప్రవేశించి నష్టపరుస్తున్నాయన్నారు. మొక్కజొన్న పంటల్లో రాత్రిళ్లు నివాసం ఉండి మొక్కను వేర్లతో సహా బుడ్డగిస్తున్నాయన్నారు. మొక్క కాండం తీపికి అలవాటు పడడం వలన పందులు ఈ విధంగా నష్టపరుస్తున్నాయని అదే విధంగా వర్జీనియా పొగాకు తోటలకు కూడా నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. రాత్రి వేళల్లో చలి తీవ్రంగా ఉండడం వలన పంటల వద్ద కాపు కాయలేని పరిస్థితి ఉందన్నారు. తనకు ఎనిమిది ఎకరాల చేను ఉందని అయితే సుమారు అరెకరం విస్తీర్ణంలో మొక్కలను పందులు బుడ్డగించాయని రైతు కాట్రు సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట చేలు కంకులు పోసుకునే దశలో ఉన్నాయని వీటిని తినడానికి పందులు అలవాటు పడితే ఇక ఈ మాత్రం పంట చేలు ఉండవని రైతులు పేర్కొన్నారు. పందుల పెంపకందారులను అడుగుతుంటే తమపై దౌర్జన్యానికి దిగడంతో పాటు, పోలీస్ కేసులను పెడతామంటూ భయపెడుతున్నారని రైతులు వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించి తమ పంటలకు పందుల నుంచి రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు. రైతులు తాండ్ర రామకృష్ణ, వేమా రామచంద్రం, అన్నంరెడ్డి సత్యనారాయణ, వేమా సత్యనారాయణ, యాగంటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గంగానమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

బుట్టాయగూడెం: మండలంలోని పడమర రేగులకుంటలో ఆదివారం ఘనంగా గంగానమ్మ, ముత్యాలమ్మ, గణపతి విగ్రహాల నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయాన్ని, విగ్రహాల ఏర్పాటును గ్రామస్తుల సహకారంతో నిర్మించారు. బి.ప్రసాద్, బీజేపీ నాయకులు కొండేపాటి రామకృష్ణలు రూ.5000 నగదును ఆలయ కమిటీ వారికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జలపాలరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. ప్రశ్నార్థకం



ఇటీవల వరదకు కుక్కునూరులో నీట మునిగిన పంట చేలు

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై స్పష్టత కరువు
- ఊసెత్తని ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆందోళనలో నిర్వాసితులు

కుక్కునూరు: ఇటీవల పోలవరం ప్రాజెక్ట్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం పట్ల విలీన మండలాల నిర్వాసితులు ఆయోమయం వ్యక్తం చేస్తున్నారు. 2026 అక్టోబర్‌కు ప్రాజెక్ట్ పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. కాని నిర్వాసితులకు ఇవ్వాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై స్పష్టమైన హామీ ఇవ్వలేదు సరికదా ఆ ఊసే ఎత్తలేదు. దీంతో ప్రభుత్వానికి ప్రాజెక్ట్ నిర్మాణంపై ఉన్న శ్రద్ధ ఆ ప్రాజెక్ట్ నిర్మాణం సాకారమయ్యేందుకు సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపై లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఏడాది గోదావరి వరదలతో పంటలు, గ్రామాలు నీటమునిగి బ్రతుకు జీవుడా అంటూ పిల్లా, పాపలతో పునరావాస కేంద్రాలకు వెళ్లి తలదాచుకుంటున్న నిర్వాసితుల గోడు ఈ నాయకులకు పట్టదా అని ఆవేదన చెందుతున్నారు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో ముంపుకు గురవుతున్న భూములకు పరిహారం చెల్లించి ఏళ్లు గడుస్తున్నా ఇంకా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపుపై స్పష్టత రావకపోవడం ఏమిటని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. ఓ పక్క ప్రాజెక్ట్ నిర్మాణాన్ని 41.15 కాంటూర్ పరిధి వరకు పూర్తి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి 45 కాంటూర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని చెప్పడం పట్ల అసలు 45 కాంటూర్ వరకు ప్రాజెక్ట్ నిర్మాణం ఉంటుందా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక 41.15 కాంటూర్‌లోని నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకే ఇన్నేళ్లు పడితే ఒక వేళ 45 కాంటూర్ నిర్వాసితులు పరిహారం చెల్లించాల్సి వస్తే అది ఇంకెన్నేళ్లు పడుతుందోనని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ పేరుతో నిర్వాసిత మండలాలను విలీనం చేసి గొప్ప పని చేశామని చెప్పుకుంటున్న నాయకులు విలీన మండలాల నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని విమర్శిస్తున్నారు. ఇకనైనా కాంటూర్‌లతో, ప్రాజెక్ట్ నిర్మాణంతో సంబంధం లేకుండా విలీన మండలాల నిర్వాసితులకు పరిహారం చెల్లించి పునరావాస కాలనీలకు పంపి గోదావరి వరదల భాద నుంచి విముక్తి కల్పించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో కొన్ని గ్రామాలకు ఇచ్చారు



గత ప్రభుత్వంలో ప్రాజెక్ట్ పనులు చేపడుతూనే కుక్కునూరు మండలంలోని 41.15 పరిధిలో కొంతమంది నిర్వాసితులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలి.

కొారు చలపతి, కుక్కునూరు